మందుబాబుల అడ్డాగా చెరువులు



మన్సూరాబాద్ చిన్న చెరువు వద్ద పగిలిన మద్యం బాటిళ్లు

- చెరువులో ముమ్మరంగా బర్త్‌డే పార్టీలు
- పగిలిన మద్యం బాటిళ్లతో వాకర్లకు ఇబ్బందులు
- కొరవడిన పోలీసుల నిఘాపై సర్వత్రా నిరసన

మన్సూరాబాద్: చెరువులను సుందరీకరణ చేపట్టి వాకర్స్‌కు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ప్రజాప్రతినిధుల ప్రకటనలు నీటి మూటలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మన్సూరాబాద్‌లోని చిన్నచెరువు, పెద్దచెరువు పరిసర ప్రాంతాలు, చెరువు కట్టలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారవుతున్నాయి. చెరువుల కట్టలు మద్యం, గంజాయి, జూద కేంద్రాలుగా మారుతున్నాయి. ఎక్కడి నుంచో వస్తున్న కొందరు ఆవారాలు చీకటిపడింది మొదలు తెల్లవారుఝాము వరకు బర్త్‌డే పార్టీల జోరుతో మత్తులో మునిగితేలుతున్నారు. చెరువుల చుట్టూ సరైన ఫెన్సింగ్ లేకపోవడం, పోలీసుల నిఘా కొరవడం మందుబాబులకు వరంగా మారింది. చెరువుల సుందరీకరణ పనులు సంవత్సరాల తరబడి నత్తనడకన జరుగుతుండటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, పోలీసులు కల్పించుకుని చెరువుల సుందరీకరణ పనులు వేగంగా చేపట్టి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని వాకర్లు, స్థానికులు కోరుతున్నారు.

- మన్సూరాబాద్ చిన్న చెరువులో నీరు లేకపోవడంతో చెరువు మధ్యలోని బండ రాళ్లపై, పెద్దచెరువు ప్రాంతంలోని నిమజ్జన కొలను సమీపంలోని చింత చెట్ల మధ్య బర్త్‌డే పార్టీలు జోరుగా సాగుతున్నాయి.
- చెరువు కట్టలపై చీకటి పడినప్పటి నుంచి తెల్లవారు ఝాము వరకు కొందరు మద్యాన్ని యథేచ్ఛగా సేవిస్తున్నారు. మద్యం బాటిళ్లను పగులగొట్టి వాకింగ్ ట్రాక్‌పై వేస్తుండటంతో ఉదయం వాకింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందుగా మారుతోంది.
- మన్సూరాబాద్ పెద్దచెరువు, చిన్నచెరువులలో యువత యథేచ్ఛగా మద్యం, గంజాయి సేవిస్తూ మత్తులో మునిగిపోతున్నారు.
- రాత్రి సమయంలో వస్తున్న పెట్రోలింగ్ సిబ్బంది ఆమ్యామ్యాలకు అలవాటుపడి మందుబాబులు మద్యం సేవిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- చెరువుల సమీపంలోనే మద్యం బెల్టు షాపులు ఉండటంతో మందుబాబులు తెల్లవారుఝాము వరకు మద్యం సేవిస్తూ చిందేస్తున్నారు.

నిఘా కొరవడినందునే...



ఎక్కడి నుంచో వస్తున్న కొందరు ఆవారా యువకులు రాత్రి నుంచి తెల్లవారుఝాము వరకు మద్యం, గంజాయి సేవిస్తూ చిందులేస్తున్నారు. ఇదేమని అడిగిన కొందరిపై మత్తులో దాడులకూ పాల్పడుతున్నారు. పోలీసులు నిఘాను మరింత పెంచాలి. చెరువుల సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తిచేసి వాచ్‌మెన్‌ను నియమించాలి.

– ఎంజాల జగన్, మన్సూరాబాద్

మరింత ముమ్మరంగా తనిఖీలు



పెద్ద చెరువులోని పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తథ్యం. యువత చెడు వ్యసనాలను దూరంగా ఉండాలి. యువత తమ భవిష్యత్తును దృష్టిలో సారించి నడుచుకోవాలి. పెద్దచెరువు ప్రాంతంలో పెట్రోలింగ్ నిఘాను మరింత పెంచి ముమ్మర తనిఖీలు చేపడతాం.

– కె.సత్యనారాయణ, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్



పెద్దచెరువు వాకింగ్ ట్రాక్‌పై మద్యం బాటిళ్లు



మన్సూరాబాద్ పెద్ద చెరువు వాకింగ్ ట్రాక్‌పై వాకర్స్

క్లుప్తంగా

గ్రంథాలయాలపై నిర్లక్ష్యం తగదు

హయత్‌నగర్: పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు చదువుకునేలా గ్రంథాలయాల్లో మెరుగైన వసతులు కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హయత్‌నగర్‌లోని లైబ్రరీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రంథాలయంలో సదుపాయాలు లేక విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తన వంతు సాయంగా గ్రంథాలయంలో లైట్లు, ఫ్యాన్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, నాయకులు ఎర్రవెల్లి సత్యనారాయణ, ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి పటిష్ట ఏర్పాట్లు

సైదాబాద్: సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ తెలిపారు. శ్రీరామనవమి నవరాత్రుల వేడుకల్లో భాగం ఆదివారం రాత్రి ఏపీ ఏయూ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో సీతమ్మని పెళ్లికూతురుగా, శ్రీరామమూర్తిని పెళ్లికొడుకుగా సంప్రదాయకంగా జరిపిన తంతులో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం కాలనీ పుర వీధులలో స్వామివారి నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మడిగెల విజయ్‌భాస్కర్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, జిట్టా సురేందర్‌రెడ్డి, రమేష్‌రాజు పాల్గొన్నారు.

పెద్దచెరువును అభివృద్ధి చేస్తా...

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువును సరికొత్త హంగులతో అభివృద్ధి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా సోమవారం పెద్దచెరువు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రాత్రి సమయంలో వాకింగ్‌కు అనుకూలంగా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు ప్రాంతంలో యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు, పనులు త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులను ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ వేగవంతం చేయాలని కోరుతున్నట్లు స్పష్టంచేశారు. కార్యక్రమంలో వాకర్లు చిల్కూరి మాధవి, కవితారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్: చిన్నచెరువు ఎఫ్‌టీఎల్‌లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులుగా మన్సూరాబాద్ చిన్నచెరువు ప్రాంతాన్ని కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. గతంలో పలు సర్వేలు చేపట్టి చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంగా గుర్తించిన స్థలంలో నేడు నిర్మాణాలను అనుమతులు వచ్చాయని నిర్మాణాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు ముడుపులు తీసుకుని అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకుని చర్యలు చేపట్టి చెరువు స్థలాన్ని రక్షించాలని కోరారు. బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, యువజన విభాగం అధ్యక్షుడు సాయిరాం గౌడ్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజాల జగన్, వెంకట్‌రెడ్డి, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 13, దొండ 40, ఆలు 18, ఉల్లి 15, గోకర 55, దోస 37, సొర 9, పొట్ల 13, అరటి 13, చిక్కుడు 55, అర్వి 55, మునగ 55.

అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే బలాల సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం అక్బర్‌బాగ్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. విద్యుత్, వీధిదీపాలు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వీధి దీపాల నిర్వాహణపై దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని, కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఆయా శాఖల అధికారులు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్: ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆస్మాన్‌ఘడ్ ఎస్‌బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దృష్టి లోపాల నివారణ కోసం ప్రభుత్వం కంటివెలుగు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. కంటివెలుగు కేంద్రాల్లో అవసరమైన వారికి అద్దాలు కూడా వైద్య సిబ్బంది ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఇతర ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వెళ్లేలా సూచిస్తారని వివరించారు. కంటివెలుగు కేంద్రానికి వచ్చే కాలనీవాసులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారు వేచిచూసేందుకు సహా అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, కృష్ణకుమార్, మంజుల, గోవర్ధన్ పాల్గొన్నారు.



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

నాటక రంగాన్ని కాపాడుకోవాలి

వనస్థలిపురం: అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కళాభిమానులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కళావేదికపై పలువురు రంగస్థల కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణరాయబారంలోని ఉపప్లావ్య ఘట్టం పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు రంగస్థల కళాకారులు డాక్టర్ కొండేపూడి శ్రీనివాసరావు జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వి.సూర్యప్రకాష్, సి.హెచ్.వి.ఆర్. కె.మూర్తి, హరనాథ్, నరసింగరావు, బాలనాగేశ్వర్ రావు, మంగపతిరావు, కవితారెడ్డి, భాస్కర్‌రావు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

చంపాపేట: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయం పట్టుకుందని అందువల్లే ఆయన లోకసభ సభ్యత్వాన్ని కుట్రపూరితంగా రద్దు చేయించారని కాంగ్రెస్ పార్టీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసినందుకు నిరసనగా చంపాపేట చౌరస్తాలో నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... భారత్ జోడో యాత్ర పేరుతో రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసిన నేపథ్యంలో దేశ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని అది జీర్ణించుకోలేని బీజేపీ నాయకత్వం రాహుల్‌పై అనర్హత వేటు కుట్రకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మెగిలిపువ్వు నారాయణ, యాదగిరి, తోకటి కిరణ్, శివ, చింటూ, జంగయ్యగౌడ్, మతిన్ షరీఫ్, సురేందర్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

చంపాపేట: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రీనగర్, బ్యాంక్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం ఆయా కాలనీల్లో పర్యటించారు. గుంతలుగా మారిన అంతర్గత రహదారులు, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను పరిశీలించారు. ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. నాయకులు ముడుపు సందీప్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు సరస్వతి, రవికుమార్, ఉపేందర్, శేఖర్, మనోహర్, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ చౌరస్తాకు శ్రీకాంతాచారి పేరుపై హర్షం

చైతన్యపురి: ఎల్‌బీనగర్ చౌరస్తాకు తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన విశ్వకర్మ ముద్దుబిడ్డ కాసోజు శ్రీకాంతాచారి పేరు పెట్టాలని ప్రతిపాదించటంపై దిల్‌సుఖ్‌నగర్ విశ్వ బ్రాహ్మణ స్వర్ణకార సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సోమవారం క్యాంప్ కార్యాలయంలో కలిసిన సంఘం నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరుడు శ్రీకాంతాచారికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కీర్తిగారి అనంతాచారి, లవకుమార్ తుడిమళ్ల, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రేషన్ వితరణ



నిత్యావసర సరుకులను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 30 వేల విలువైన రేషన్ సరుకులను యూసుఫ్‌గూడ, ప్రగతినగర్‌కు చెందిన కడాలి గోపాల్ కృష్ణ భారతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ కె.వి.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ... అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాల అనాథ, నిరుపేద విద్యార్థులకు భోజన, వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తుకు కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశామన్నారు. రేషన్ వితరణ చేసిన ట్రస్టుకు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ పైనుంచి దూసుకెళ్లిన వాహనం

పహాడీషరీఫ్: స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళపై నుంచి వాహనం దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ కథనం ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్ జుబేర్, పర్వీన్ బేగం(30) దంపతుల కుమారుడు స్థానికంగా ఉన్న మదర్సాలో చదువుతున్నాడు. సోమవారం ఉదయం తన కుమారుడికి పండ్లు పంపించేందుకుగాను రెగ్యులర్‌గా వచ్చే స్కూల్ బస్సు కోసం ఆమె షాహీన్‌నగర్ హైవే హోటల్ బస్టాప్ రోడ్డులో మరో మహిళతో కలిసి నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో వెనుక నుంచి టీఎస్ 07 యుజీ 1491 నంబర్‌గల వాహనం దూసుకొచ్చి పర్వీన్ బేగంను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యతతో క్రీస్తు ప్రేమను చాటాలి

మలక్‌పేట: క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగుతూ ఏసుక్రీస్తు చూపించిన ప్రేమను ప్రపంచానికి చాటిచెప్పాలని ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ తిమోతి కొల్లబత్తుల అన్నారు. సీనియర్ పాస్టర్ రెవరెండ్ జయకర్ డేవిడ్ అధ్యక్షతన సోమవారం మలక్‌పేటలో జరిగిన అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని చేపట్టనున్న 'రన్ ఫర్ జీసెస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యువత అధిక సంఖ్యలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. నేటివ్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ ఎడ్గర్ సటులూరి బైబిల్ లేఖనాలు బోధించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాల్మన్‌రాజ్, బిషప్ ధన్‌రాజ్ కోట, బిషప్ దయానంద్, పాస్టర్లు, చర్చిల పెద్దలు, యూత్ లీడర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

ఎల్‌బీనగర్: నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ.. వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం బీఎన్‌రెడ్డి కాలనీలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రముఖ వాస్తు నిపుణుడు కృష్ణాదిశేషుతో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి చేయూత

నాగోలు: పేద కుటుంబాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనిస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నాగోలులో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన పంతు నాయక్ కూతురు హేమ వివాహం సందర్భంగా సోమవారం నాగోలులోని ఉప్పల శ్రీనివాస్ గుప్తాను కలిశారు. ఈ సందర్భంగా వారికి మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు.



సాయం అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నాగోలు: ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద పీట వేశారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాగోలు డివిజన్ ఆత్మీయ సమ్మేళనం సోమవారం నాగోలులో గౌడ సంఘం ఫంక్షన్ హాలో బీఆర్‌ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారన్నారు. తెలంగాణ రాక ముందు.. తరువాత ఎల్‌బీనగర్ ఎలా ఉందనే విషయాన్ని ఓసారి ప్రజలు పరిశీలిస్తే అభివృద్ధిని గుర్తించవచ్చన్నారు. భవిష్యత్‌లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్‌ల సమస్య పరిష్కారం కోసం జీవో 118 తీసుకొచ్చిన ఘనత సుధీర్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఎల్‌బీనగర్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఎల్‌బీనగర్‌లో రూ. 658 కోట్ల నిధులతో ఫ్లైఓవర్లు, బ్రిడ్జిలు నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మూసీ నదిపై దాదాపు 15 బ్రిడ్జిలు నిర్మించనున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని నాగోలు చౌరస్తాలో ఫ్లైఓవర్‌ను నిర్మించామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రతిపక్షాలను చెప్పుచేతల్లో పెట్టుకోవాలని సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్‌లను దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. అదానీ కేసును కేసులు పక్క దారి పట్టించడానికి రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని తెలిపారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు వంటి అనేక సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అమరివాది లక్ష్మీనారాయణ, నాగోలు మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత, బీఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, సిహెచ్ రమేష్, గోల్కొండ మైసయ్య, నాగోలు సుధాకర్‌చారి, సతీష్ యాదవ్, తూర్పాటి కృష్ణ, రాజు గౌడ్, చెర్కు జంగయ్య, బద్దం నరేందర్‌గౌడ్, మహేందర్, కట్ట ఈశ్వరయ్యగౌడ్, బద్దం మహేందర్‌గౌడ్, బద్దం శ్రీధర్‌గౌడ్, రవి, దాస్‌గౌడ్, శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్



డీసీపీ రూపేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సైదాబాద్: పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ సూచించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... పండుగలప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పండగల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాల నిర్వాహకులు, నాయకులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు డీసీపీని సన్మానించారు. మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, వీరేంద్రబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది పండగల సీజన్...

హస్తినాపురం: రానున్నది పండగల సీజన్ అని... ప్రజలు పండగలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ కోరారు. వనస్థలిపురం పీఎస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... చట్టాలను అందరూ గౌరవించాలని వాటిని ఎవరు అతిక్రమించినా సహించేది లేదని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండగలు జరుపుకోవాలని సూచించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్, గుడ్‌ఫ్రైడేలను పురస్కరించుకుని ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఐక్యతతో పండగలు జరుపుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒక వర్గాన్ని, మతాన్ని కించపరిచేలా, రెచ్చగొట్టేలా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.